నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 5 ఏప్రిల్ 2025 HYDERABAD



సూరారం గ్రామ పరిధి సర్వేనంబర్ 16/28లోని ప్రైవేట్ భూముల్లో నిర్మించుకున్న ప్రహరీని హైడ్రా అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఎస్ ఎఫ్ ఐ అధికారుల ఫిర్యాదుతో కూల్చివేతలు చేపట్టినట్టు హైడ్రా అధికారులు పేర్కొంటుండగా, తమ ప్రైవేటు భూముల్లో నిర్మించుకున్న ప్రహరీని ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా హైడ్రా కూల్చి వేసిందని భూ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. -దుండిగల్,ఏప్రిల్ 4

## వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 33.0, కనిష్ఠం 21.1 డిగ్రీలు, గాలిలో తేమ 47 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



తుమ్మలబస్తీ బల్కాపూర్ నాలాలో వ్యర్థాల్లో కూరుకుపోయిన ఎక్స్‌కవేటర్ వాహనం




# ముంచెత్తిన నిర్లక్ష్యం!

### నాలా పూడికతీత పనుల ఆలస్యంతో మునిగిన లోతట్టు ప్రాంతాలు

సిటీబ్యూరో: అకాలవర్షం గ్రేటర్ జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. నాలాల పూడికతీత నిర్లక్ష్యంతో లోతట్టు ప్రాంతాలను వరద నీటితో ముంచెత్తింది. ఇందుకు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగమే ప్రధాన కారణం. జనవరిలో మొదలు కావాల్సిన నాలా పూడికతీత పనులను మార్చి నెల ముగిసినా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయలేకపోయారు. ఈ ఏడాదిలో రూ.55 కోట్లతో 203 చోట్ల పనులు చేపడుతున్నామని, 120 చోట్ల పూడిక తీత పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన 83 చోట్ల పనులను టెండర్ల ప్రక్రియ ముగింపులో ఉందని, త్వరలోనే ఈ పనులు మొదలు పెడతామని ఇటీవల అధికారులు చెప్పారు. అరగంట పాటు ఏకధాటిగా కురిసిన 9 సెంటీ మీటర్ల వర్షంతో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు ఫిర్యాదులు పోటెత్తాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి శుక్రవారం అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్యంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, లోటస్ ఫాండ్ నుంచి వర్షపు వరద ప్రవాహం వచ్చిందని, హకీంపేట నుండ బల్కం చెరువులోకి వరద నీరు సాఫీగా వెళ్లడం లేదని, లే అవుట్ కారణంగా మట్టితో కూడిన వరద రావడంతో సమస్య తలెత్తిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు.

**కూలిన స్తంభాలు..**

అకాలవర్షంతో ఆగమాగమైన హైదరాబాద్ నగరంలో ఇంకా కరెంట్ బాధలు తీరలేదు. ప్రధానంగా మీరాలంమండిలో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు సుమారుగా 20 గంటలు కరెంట్ లేదని ఒక వినియోగదారుడు కాంప్లైంట్ చేయగా, ఖలందర్‌నగర్‌లో ఎనిమిది గంటల పాటు కరెంట్ పోతే.. తిరిగి శుక్రవారం కూడా అదే పరిస్థితి నెలకొందని మరో వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. మరోవైపు మదీనా మార్కెట్, పతేర్‌ఘటిలో శుక్రవారం సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ పునరుద్ధరణ జరగలేదని మరో వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. వర్షానికి గ్రేటర్‌లో 57 పోల్స్, 44 డీటీఆర్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాగా, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సాలార్‌జంగ్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను ఎస్పీడీసీఎల్ సీఎండీ సస్పెండ్ చేశారు.

### చెత్తకుప్పలా..బల్కాపూర్ నాలా..


ఖైరతాబాద్: తుమ్మలబస్తీలోని బల్కాపూర్ నాలా వ్యర్థాలతో నిండిపోవడంతో గురువారం కురిసిన వర్షానికి ఉప్పొంగింది. నిర్వహణ లేకపోవడంతో గతేడాది సైతం భారీగా వ్యర్థాలు పేరుకుపోయి ముంపునకు గురైంది. గతంలో ఇదే నాలాలో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వస్తువులు ఏరుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు వ్యర్థాల్లో ఇరుక్కుపోయి మృత్యువాతపడ్డాడు. కాగా, బల్కాపూర్ నాలాకు ఓ వైపు వేసిన ఫెన్సింగ్ ఎక్కడికక్కడే ఊడిపోయింది. నాలాలో నిత్యం వ్యర్థాలు తొలగిస్తేనే అక్కడ వరదను నివారించే అవకాశం ఉంటుంది. ఆలస్యంగానైనా సర్కిల్ పరిధిలో నాలాల డీసిల్టింగ్‌ను ప్రారంభించగా, గురువారం కురిసిన భారీ వర్షానికి బల్కాపూర్ నాలాలో దిగిన ఎక్స్‌కవేటర్ వ్యర్థాల్లో కూరుకుపోయి దెబ్బతిన్నది.

**లాంగ్ స్టాండింగ్ అధికారుల నిర్లక్ష్యం**

సర్కిల్ -17 పరిధిలో ఇంజినీరింగ్ విభాగంలో కొందరు అధికారులు బదిలీలు పొందకుండా ఏండ్ల తరబడి లాంగ్ స్టాండింగ్‌లో ఉంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి నిర్లక్ష్యం వల్లే నాలాల నిర్వహణ లేక వరద ముంపు ముంచుకొస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

# బీఆర్‌ఎస్ రజతోత్సవం

### మాజీ మంత్రులు, మూడు జిల్లాల అధ్యక్షులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం




సిటీబ్యూరో : బీఆర్‌ఎస్ ఏర్పడి 25 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా రజతోత్సవ సన్నాహక సమావేశాలు నియోజక వర్గాల వారీగా నిర్వహించేందుకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సన్నద్ధమయ్యారు. జిల్లాల అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, శంభీపూర్ రాజు, మంచిరెడ్డి కిషన్ రెడ్డి,అధ్యక్షతన ఆయా జిల్లాలలో నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన శుక్రవారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, మూడు జిల్లాల అధ్యక్షులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, సురభి వాణీదేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కొప్పుల మహేశ్ రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి, జయసింహ, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నగేశ్, నివేదిత సాయన్న, పంజుగుల శ్రీశైల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్యం గురించి కేసీఆర్ వాకబు చేశారు. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నానని గోపీనాథ్ తెలిపారు.





శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితాఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్ రాజు తదితరులు



## కార్పొరేటర్ వినూత్న నిరసన

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ ఓ కార్పొరేటర్ వినూత్న నిరసన చేపట్టారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ విభాగంలోని సీసీపీ కార్యాలయం ఎదుట నేలపై పడుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంగా బాల సరస్వతి నగర్‌లో నాలా పనుల్లో భూమి కోల్పోయిన వారికి పరిహారాన్ని చెల్లించడంతో తాత్సారం చేస్తున్నారని శ్రవణ్ మండిపడ్డారు. అనేక రోజులుగా టీడీఆర్ ఎందుకు ఇవ్వడం లేదని అడిగినా.. అధికారుల నుంచి స్పందన లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా టీడీఆర్ బాధితుడితో పాటు శ్రవణ్‌ను తమ చాంబర్‌లోకి పిలిపించుకుని సీసీపీ శ్రీనివాస్ మాట్లాడారు. వివరాలను తీసుకుని వెంటనే బాధితులకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో శ్రవణ్ తమ నిరసనను విరమించుకున్నారు.

## ఎంటమాలజీలో సమూల ప్రక్షాళన

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగంలో సమూల ప్రక్షాళనకు కమిషనర్ ఇలంబర్తి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ బి. రమేశ్‌తో పాటు మరో సూపర్‌వైజర్‌పై వేటు వేశారు. ఇటీవల లంగర్‌హౌజ్ పార్కు లేక్‌లో గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియలో భాగంగా మిషన్లతో పనులు జరపాల్సిన చోట కార్మికులతో పనిచేయించడం, చెరువులో పడి ఇద్దరు తండ్రికొడుకులు ఇద్దరు చనిపోయిన సంగతి తెలిసిందే. పనుల పర్యవేక్షణలో సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌ల నిర్లక్ష్యం ఉందని, మిషిన్లతో జరపాల్సిన పనులను కార్మికులతో జరిపించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి బాధ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇదే విషయంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ కె.రజినీ నిర్లక్ష్యం ఉందని కమిషనర్ హెచ్చరించారు. అంతేకాకుండా ఎంటమాలజీ చీఫ్ పోస్టు కావాలంటూ ఓ మంత్రితో పైరవీలు చేయడం, మూడేళ్లకు పైబడి జీహెచ్ఎంసీలో రజినీ కొనసాగుతుండడం, ఇటీవల ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కమిషనర్ ఒకింత ఆగ్రహాన్ని తెప్పించాయి. ఈ నేపథ్యంలోనే రజినీ మాతృ సంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే మూడు సీనియర్ ఎంటమాలజిస్టులు , చీఫ్ ఎంటమాలజిస్ట్ పోస్టులు భర్తీ చేయాలంటూ వైద్య ఆరోగ్యశాఖకు కమిషనర్ లేఖ రాశారు. ఆరోగ్యశాఖ నుంచి ఎస్ఈ మాధవరెడ్డి జీహెచ్ఎంసీకి అలాట్ కాగా ఇప్పటి వరకు ఆయన బాధ్యతలు తీసుకోలేదు.

# చిట్టి గుండెకు నిమ్స్ పునర్జన్మ

### మూడేండ్లలో వెయ్యి క్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలు



సిటీబ్యూరో: పుట్టుకతోనే గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను అక్కున చేర్చుకుని పునర్జీవం ప్రసాదిస్తోంది నిమ్స్ హాస్పిటల్. కేసీఆర్ సర్కార్ 2022లో పిడియాట్రిక్ కార్డియో సర్జరీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ వంటి పథకాల ద్వారా లక్షల రూపాయల ఖరీదైన వైద్యాన్ని పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేడు ఎంతో మంది చిన్నారులకు నిమ్స్ పునర్జన్మ ప్రసాదిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ విభాగంలో కార్పొరేట్‌లలో సైతం కాదని చేతులెత్తేసిన క్లిష్టమైన కేసులను విజయవంతంగా చికిత్స చేయడంతో రోజురోజుకు ఈ విభాగానికి రోగుల తాకిడి పెరుగుతోంది. నిమ్స్‌లో జరుగుతున్న శస్త్రచికిత్సల్లో 25శాతం కేసులు ఇతర రాష్ట్రాల నుంచే వస్తున్నట్లు కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్‌రావు తెలిపారు. పుట్టుకతోనే వచ్చే గుండె వ్యాధులతో బాధపడే చిన్నారులను బతికించడానికి 2022లో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా పిడియాట్రిక్ కార్డియో సర్జరీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విభాగం అందుబాటులో లేకముందు ఏడాదికి కేవలం 40నుంచి 50 సర్జరీలు జరిగేవి. ప్రత్యేక విభాగం అందుబాటులోకి వచ్చిన తరువాత సంవత్సరానికి 300 నుంచి 350 వరకు క్లిష్టమైన గుండె సర్జరీలు చేస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డా.బీరప్ప, కార్డియో థొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్‌రావు తెలిపారు. ప్రతి నెల కనీసం 30 క్లిష్టమైన సర్జరీలు చేస్తున్నామని, గడిచిన మూడేండ్లలో ఇప్పటి వరకు సుమారు వెయ్యి గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా జరిపినట్లు డాక్టర్ అమరేశ్‌రావు తెలిపారు.

### నవజాత శిశువులకూ గుండె ఆపరేషన్లు

నిమ్స్‌లో 1.1కిలో బరువున్న నవజాత శిశువులకు కూడా విజయవంతంగా గుండె ఆపరేషన్లు చేస్తున్నాం. ఎక్కువగా పుట్టుకతోనే గుండెలో రంధ్రాలు ఉండడం, హార్ట్ డిజార్డర్, గుండెకు సంబంధించిన కనెక్షన్స్ సరిగ్గా లేకపోవడం, గుండె పనితీరు బలహీనంగా ఉండటం వంటి సమస్యలతో చిన్నారులను తీసుకువస్తున్నారు. అత్యంత ఖరీదైన నైట్రిక్ ఆక్సైడ్, ఎక్మో, ఫొటో థెరపి, డయాలసిస్ తదితర వైద్య సదుపాయాలతో పాటు నిష్ణాతులైన వైద్యబృందం అందుబాటులో ఉండడంతో తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, మహారాష్ట్ర తదితర పొరుగు రాష్ట్రాల నుంచి ఈ మధ్య ఎక్కువ కేసులు వస్తున్నాయి. అన్ని కేసులు క్రిటికల్ స్టేజీలోనే వస్తున్నాయి. ప్రతి నెలా 20 నుంచి 30 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా చేస్తున్నాం. చిన్నారుల గుండె మార్పిడి వంటి క్లిష్టమైన సర్జరీల కోసం యూఎస్, యూకె వైద్యనిపుణుల సహకారం కూడా తీసుకుంటున్నాం. నిమ్స్‌లో చిన్నారులకు ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ తదితర పథకాల కింద లక్షల రూపాయల ఖరీదైన, క్లిష్టమైన గుండె ఆపరేషన్లు పూర్తి ఉచితంగానే చేస్తున్నాం.

**- డాక్టర్ అమరేష్‌రావు, కార్డియో థొరాసిక్ విభాగాధిపతి, నిమ్స్ హాస్పిటల్**



## నేటి నుంచి 12 వరకు కాంక్రీట్ మిల్లర్ల బంద్

సిటీబ్యూరో: నిత్యవసర ధరలు ఆకాశాన్నటుతుంటే కాంక్రీట్ మిల్లర్ రేట్లు నేలను చూస్తున్నాయని, చాలామంది మిల్లర్ కార్మికులు మిల్లర్లు అమ్ముకొని ఊరి బాట పట్టే దౌర్భాగ్యమైన స్థితి నెలకొందని తెలంగాణ కాంక్రీట్ మిల్లర్ ఓనర్ అండ్ లేబర్ యూనియన్ చైర్మన్ వి. నాగరాజు, స్టేట్ కన్వీనర్లు, పి రవి కుమార్ రెడ్డి, బీసం గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. తగ్గుతున్న రేట్లకు నిరసనగా శనివారం నుంచి 12 వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంక్రీట్ మిల్లర్లను బంద్ పాటించనున్నట్లు పేర్కొన్నారు. 10న ధర్నా చౌక్ వద్ద నిరసన చేపడతామని వెల్లడించారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

## రైలు ఢీకొని డాక్టర్ మృతి

కాచిగూడ: కర్ణాటక సంపర్ క్రాంతి రైలు ఢీకొని ఓ డాక్టర్ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం చంచల్ గూడకు చెందిన షేక్ మహమ్మద్ అలీ కుమార్తె అలీషా(26) వృత్తిరీత్యా డాక్టర్. శుక్రవారం కాచిగూడకు రావడానికి మలక్‌పేట రైల్వే స్టేషన్ రెండో ఫ్లాట్‌ఫారం నుంచి ఒకటో ఫ్లాట్ ఫారానికి రావడానికి పట్టాలు దాటుతుండగా అదే సమయంలో కర్ణాటక సంపర్క్ క్రాంతి రైలు ఢీకొనడంతో అలీషా అక్కడికక్కడే మృతి చెందింది.

# సన్న బియ్యం నో స్టాక్

మేడ్చల్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): రేషన్ దుకాణాల వద్ద సన్న బియ్యం నో స్టాక్ బోర్డులు దర్శనంతో రేషన్‌కార్డుదారులు ఆందోళనకు గురువుతున్నారు. మేడ్చల్ జిల్లాలో 5,28,881 తెలుపు రేషన్ కార్డులు ఉండగా 10,761,607 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ చెప్పినప్పటికీ సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభమైన నాలుగు రోజులకే నో స్టాక్ బోర్డుల దర్శనమిచ్చాయి. జిల్లాలో జరుగుతున్న సన్న బియ్యం పంపిణీపై జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలను అప్పగించారు.



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఎదులాబాద్‌లో సన్న బియ్యం లేవని నో స్టాక్ బోర్డు


# నిర్బంధంలోనే హెచ్‌సీయూ

### చదును చేసిన ప్రాంతంలోకి అనుమతి నిరాకరణ

సిటీబ్యూరో: హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని చదును చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పంపించిన బుల్డోజర్లు వెనక్కి వెళ్లినా పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నది. క్యాంపస్ అంతటా పోలీసులు గస్తీ కాస్తున్నారు. మెయిన్ గేట్ వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. అనుమతి లేనిదే ఎవ్వరినీ యూనివర్సిటీలోకి అనుమతించడంలేదు. విద్యార్థులను సైతం ఐడీ కార్డు చూపిస్తేనే బయటకు, లోపలికి అనుమతిస్తున్నారు. దట్టమైన అడవిని తొలగించి చదును చేసిన ప్రాంతంలో బారికేడ్లను తొలగించలేదు. పోలీసు బందోబస్తు కొనసాగుతున్నది. విద్యార్థులను సైతం అటువైపు రానీయడంలేదు. చెట్లు, భారీ పొదలను నరికేసిన ప్రాంతాన్ని ఫొటోలు కూడా తీయనీయడం లేదు. కొంత మంది విద్యార్థులు రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన విధ్వంసాన్ని ఫోన్లలో చిత్రీకరించే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారి ఫోన్లను లాగేసుకున్నారు. అటువైపు వచ్చినా.. ఫొటోలు తీసినా కేసులు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరిస్తున్నారు.

**విధ్వంసం బయటపడుతుందనే అనుమతించట్లేరా?**

హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ సర్కారు సృష్టించిన విధ్వంస కాండ బయటపడుతుందనే చదును చేసిన ప్రాంతంలోకి అనుమతించడంలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వందలాది మహా వృక్షాలను నరికేసి పడేసిన కుప్పలు బయటపడతాయని తమను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ఆపేసి బుల్డోజర్లు వెనక్కి వెళ్లాక కూడా అటువైపు ఎందుకు వెళ్లనీయడంలేదని నిలదీస్తున్నారు. యూనివర్సిటీలో ఆందోళనలు విరమించాక విద్యార్థులపై నిర్బంధం దేనికి కొనసాగిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. యూనివర్సిటీలో ఇంకా పోలీసుల బందోబస్తు ఎందుకు చేపడుతున్నారని అడుగుతున్నారు. క్యాంపస్ నుంచి పోలీసులను వెనక్కి పంపించి విద్యార్థులపై నిర్బంధాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నారు.




**3.21లక్షల మంది సంతకాలు**

హెచ్‌సీయూను కాపాడుకుందామంటూ ఛేంజ్‌డాట్‌ఆర్గ్‌లో సంతకాల ఉద్యమం కొనసాగుతుంది. ఇప్పటికే 3.21లక్షల మంది హెచ్‌సీయూకు మద్దతుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపిస్తూ సంతకాలు చేశారు.

# రైలులో బాలికపై లైంగిక వేధింపులు

### పోలీసుల అదుపులో నిందితుడు

సిటీబ్యూరో/ మారేడుపల్లి, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): రైళ్లలో ప్రయాణికులు ప్రత్యేకించి మహిళల భద్రత గాల్లో దీపంలా మారింది. మొన్న ఎంఎంటీఎస్‌లో యువతిపై లైంగిక వేధింపుల ఘటన మరవకముందే తాజాగా ఓ చిన్నారిని రైలులో ఒక వ్యక్తి లైంగికంగా వేధించి తన సెల్‌ఫోన్లో వీడియోలు తీసిన ఘటన వెలుగుచూసింది. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం రక్సెల్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా అందులో ఉన్న 12 ఏండ్ల బాలిక అర్ధరాత్రి రెండు గంటలకు వాష్‌రూమ్ వెళ్లింది. గమనించిన దుండగుడు ఆమెను లైంగికంగా వేధించడంతో పాటు వీడియోలు కూడా తీశాడు. బాలిక తప్పించుకుని కుటుంబసభ్యులకు వివరాలు చెప్పడంతో వారు అతనిని పట్టుకుని సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియోలను చూశారు. వెంటనే 139కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా రైల్వే పోలీసులు సికింద్రాబాద్‌లో బీహార్‌కు చెందిన నిందితుడు సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసును బీహార్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. ఇదిలా ఉంటే డబీర్‌పూర సమీపంలో మహిళా కోచ్‌లోకి దూరిన కొందరు యువకులు వికృతంగా ప్రవర్తించి భయాందోళనలకు గురిచేశారని రైల్వే పోలీసులకు కొందరు యువతులు ఇటీవల ఫిర్యాదు చేశారు.ఇలా రైళ్లలో వరుసగా జరుగుతున్న ఘటనలతో మహిళా ప్రయాణికుల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.



**వేధిస్తున్న సిబ్బంది కొరత..**

తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల రైళ్లలో నిరంతర తనిఖీలు, గస్తీ నిర్వహణ చాలా కష్టమవుతున్నదని రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు ఆర్పీఎఫ్, జీఆర్పీ మధ్య సమన్వయం లేకపోవడం వల్ల నేరాల నియంత్రణ సవాల్‌గా మారిందనే అభిప్రాయం ఉంది. కాగా, ఇటీవల ఎంఎంటీఎస్ ఘటన తర్వాత రైల్వే శాఖ అప్రమత్తమై రైళ్లలో పానిక్ బటన్ పెట్టాలని నిర్ణయించింది. అయితే మహిళల భద్రతపై కొత్తగా చర్యలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ ఆచరణలోకి రాకపోవడంతో తాజాగా మరో ఘటన జరిగింది.